క్లుప్తంగా

యుద్ధభేరి మహాసభకు తరలిరండి

కడప సెవెన్‌రోడ్స్ : మాదిగ, రెల్లి, డొక్కలి, ఉప కులాల యుద్ధభేరి మహాసభ ఈనెల 30వ తేదీ విజయవాడ గాంధీనగర్ జింఖాన గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నారని, జిల్లాకు చెందిన మాదిగలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, జిల్లా అధ్యక్షులు శివ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపాన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, చెర్మన్ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 వేలు విరాళం



హిందీ పండిట్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: కడప డీఈఓ కార్యాలయ ఆవరణంలోని సరస్వతి దేవి ఆలయ నిర్మాణానికి పీఆర్ గవర్నమెంట్ హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పాలెం విజయలక్ష్మి రూ. 50 వేలు విరాళంగా ఇచ్చారు. ఇందుకుగాను శుక్రవారం డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తమ కార్యాలయంలో ఉపాధ్యాయురాలు పాలెం విజయలక్ష్మిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

రేపు కెనాన్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్

కడప కల్చరల్ : ప్రముఖ ఫొటోగ్రఫీ సంస్థ కెనాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కడప నగర పరిధిలోని జయరాజ గార్డెన్స్‌లో ఉచిత ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి, కడప నగర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరామకృష్ణలు తెలిపారు. ఈ మేరకు కడప నగరంలోని మూర్తి స్టూడియోలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉత్తమ సమాజం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అతిథులు

కడప ఎడ్యుకేషన్ / కడప కల్చరల్ : విలువలతో కూడిన విద్యతోనే ఉత్తమ సమాజం ఏర్పడగలదని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి అన్నారు. శుక్రవారం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్పిరిట్స్ కళాశాలలో నైతిక విలువల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్ రవీంద్రనాథ్, మానవతా జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సి.సుబ్బారెడ్డి, సంస్థ నగర కోశాధికారి డి.వీరారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాలకు చెందిన ఇద్దరు పేద విద్యార్థులకు రూ. 10 వేలు ఆర్థికసాయం చేశారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఓం శాంతి సంస్థ ప్రతినిధి ప్రదీప అక్కయ్య తెలిపారు. శుక్రవారం కడప డీపీటీఓ కార్యాలయంలో కేఎంపీఎల్ సాధించని, ప్రమాదాలు చేసే డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంచసూత్రాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పీజేడీఐ కృష్ణారెడ్డి, బద్వేలు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామయ్య వారిని బస్సులో తీసుకెళ్లి రహదారిపై ఉండే సిగ్నల్స్, ఇంధన పొదుపుపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోలకు చెందిన 17 మంది డ్రైవర్లు, ముగ్గురు హయ్యర్ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ



విద్యార్థి శౌరి ఆర్యన్‌ను అభినందిస్తున్న ఏజీఎం రమణయ్య, ప్రిన్సిపాల్ కవిత

కడప ఎడ్యుకేషన్: కడప రాజీవ్‌పార్కు వద్ద శ్రీచైతన్య స్కూల్ బ్రాంచ్‌లో 1వ తరగతి చదువుతున్న శౌరి ఆర్యన్ 4 నిమిషాల 30 సెకన్లలో ఏకధాటిగా 1 నుంచి 20 వరకు మ్యాథ్స్ టేబుల్స్‌ను చెప్పినందుకుగాను ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులో తమ పేరును నమోదు చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. అతి చిన్న వయసులో శౌరి ఆర్యన్ ఈ ఘనత సాధించినందుకుగాను శుక్రవారం శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య విద్యార్థి శౌరి ఆర్యన్‌కు సర్టిఫికెట్‌తోపాటు మోడల్స్‌ను అందచేసి అభినందించారు.

హరహర మహాదేవ శంభో..

- కడప నుంచి కాశీకి ఐదు లక్షల శివలింగాలు
- తయారీలో రోజూ 300 మంది భక్తులు



సిద్ధం చేసిన చిట్టి శివలింగాలు



శివలింగాల తయారీలో మహిళలు

కడప కల్చరల్ : హరహర మహాదేవ శంభో....అన్న శివనామ స్మరణతో ఆ పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. దాదాపు 300 మంది శివ భక్తులైన మహిళలు ఒకేచోట చేరి మట్టితో చిట్టిచిట్టి శివలింగాలను తయారు చేస్తున్నారు. వారిలో కొన్ని బృందాలు వాటికి తుది మెరుగులు దిద్దుతూ, ఆరబెడుతూ జాగ్రత్తగా ప్యాకింగ్ చేస్తుండడం కార్తీక మాసం రెండు వారాల ముందే వచ్చేసిన అనుభూతిని కలిగిస్తున్నది.

– కార్తీక మాసంలో పౌర్ణమి నాడు కాశీలో ఇలా రూపొందించిన కోటి చిన్న శివలింగాలతో విశేష పూజలు నిర్వహిస్తారని, దానికి ప్రధాని లాంటి ప్రముఖులు కూడా హాజరవుతారని తెలుస్తోంది. ఇందులో భాగంగా కడప, ప్రొద్దుటూరులోని ధార్మిక సంస్థలు భక్తులకు ఐదు లక్షల శివలింగాలు తయారు చేయాలని సూచించారు. ఈ ప్రాంతాలలో రోజూ దాదాపు 300 మంది మహిళలు దీన్ని ఓ యజ్ఞంగా భావించి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు శివలింగాలను రూపొందిస్తున్నారు. ఒక్కో శివలింగం బొటనవేలంత సైజులో ఉండేలా నల్లబంక మట్టితో నిర్వాహకులు ఇచ్చిన అచ్చుల ద్వారా తయారు చేస్తున్నారు. మట్టిని కూడా కాశీ నుంచి నిర్వాహకులే పంపడంతో స్థానిక భక్తులు దాన్ని నీటితో తడిపి, ఉండలు చేసి అచ్చు పోస్తున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం కూడా తయారు చేసుకుంటున్నారు. స్థానిక చిన్నచౌకులోని ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్‌లో ప్రస్తుతం ఈ తయారీ జరుగుతోంది. స్థానిక భక్తులు, బాలాజీ సేవా సమితి ప్రతినిధులు భారవి, విజయచంద్రారెడ్డి, రమాదేవి, అమరావతిల పర్యవేక్షణలో విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. తమకు కేటాయించిన ఐదు లక్షల శివలింగాలను పది రోజుల్లో సిద్ధం చేస్తామని వారు తెలియజేశారు.

అవినీతి రహిత సమాజం కోసం కృషి



ర్యాలీని ప్రారంభిస్తున్న కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష

కడప అర్బన్: అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష అన్నారు. గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడపలోని స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి విజిలెన్స్ అవగాహన ర్యాలీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష ప్రారంభించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసి బస్టాండ్ వరకు «విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్»లో భాగంగా అవినీతిని వ్యతిరేకిద్దాం, దేశానికి కట్టుబడదాం అనే అంశంపై 300 మంది విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ మాసుంబాష మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చేద్దామన్నారు. దుర్వినియోగాన్ని అరికడదామన్నారు. ఆహార పదార్థాల తయారీలో కల్తీలను అరికడదామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడదామన్నారు. పన్నులు, రుసుములను సక్రమంగా చెల్లించేలా చూసి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి, మౌళిక వసతుల కల్పనకు తోడ్పడదామన్నారు. సహజవనరులను సంరక్షించుకుని వాటిని భావితరాలకు అందిద్దామన్నారు. ఈ ర్యాలీలో విజిలెన్స్ అధికారులు జి. ఈదురుబాష, ఇన్‌స్పెక్టర్ టి. రెడ్డెప్ప, డీఈఈ ఏవీ జవహర్‌రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ. బాలగంగాధర్‌రెడ్డి, ఏఈఈలు కె.వి కిషోర్, వి. అశోక్‌కుమార్, అడ్మిన్ ఆఫీసర్ ఎస్.జి. అజీముల్లా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం కల్పించిన మహిళా రిజర్వేషన్లలో దామాషా ప్రకారం బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం ఇస్తామన్నారు. బీసీ జన గణనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కేబినెట్‌లో నిర్ణయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పి గురుస్వామి, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, ఉపాధ్యక్షులు కళ్యాణ్ సుధాకర్, పస్తం అంజి, ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా నరసింహ, మల్లికార్జున నరసింహం, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో సినీ నటులు



కడప కల్చరల్ : కడప అమీన్ పీర్ దర్గాను శుక్రవారం సాయంత్రం స్పార్క్ సినీ బృందం దర్శించుకుంది. దర్గా ముజావర్ అమీర్ వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. హీరో విక్రాంత్ రెడ్డి, హీరోయిన్ రుక్సర్ ధిల్లాన్ పూలచాదర్ స్వయంగా తీసుకొచ్చి దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు వారికి గురువుల విశిష్టతను, చరిత్ర, మహిమల గురించి వివరించారు. సినీ నటులు మాట్లాడుతూ ఈనెల 17న తమ స్పార్క్ సినిమా విడుదల కానున్న సందర్భంగా దర్గా గురువుల ఆశీస్సుల కోసం వచ్చిప్రార్థనలు చేశామన్నారు. ప్రేక్షకులు తమ సినిమాను ఆదరించాలని కోరారు.

రాహుకాల పూజలు



రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారికి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు రాహుకాల పూజ విశేషాలను వివరించారు. పూజలు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

దర్గా రూములను తొలగించవద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని కాగితాల పెంటలో వెలసిన హజరత్ పీర్ ఓ ముర్షద్ రసూల్ షావలి దర్గా రూములను తొలగించవద్దని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్, దర్గా ప్రతినిధులు, మత గురువులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా వారు కమిషనర్ దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. రోడ్డు విస్తరణలో భాగంగా దర్గాకు సంబంధించిన రూములను తొలగించరాదని కోరారు. దర్గా నిర్వహణ, ఉరుసు ఉత్సవాల నిర్వహణ ఖర్చు రెండు రూముల ద్వారానే సమకూరుతుందని కమిషనర్‌కు వివరించారు. ఇందుకు కమిషనర్ సూర్యచంద్ర ప్రవీణ్ స్పందిస్తూ తాను మంగళవారం మరోసారి దర్గా, దాని పరిసర ప్రాంతాలను సందర్శించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామ సభలు నిర్వహించండి

సిద్దవటం : ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజులరెడ్డి మాట్లాడుతూ ఈ సామాజిక తనిఖీలు శుక్రవారం నుంచి ప్రారంభించి వారం రోజులపాటు అన్నీ గ్రామ పంచాయతీలలో డీపీఆర్‌ల తనిఖీ నిర్వహిస్తారన్నారు. తనిఖీలు జరుగు సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నీ పనులను తనిఖీ సిబ్బందికి చూపించాలని, వారు అడిగిన సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ జవహర్‌బాబు మాట్లాడుతూ తనిఖీ సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలపాలని, గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందన

వైవీయూ : దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొనే యోగివేమన విశ్వవిద్యాలయం కబడ్డీ మహిళల జట్టుకు ఎంపికైన ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అభినందించారు. ఇటీవల వైవీయూలో నిర్వహించిన ఎంపికల్లో కళాశాల నుంచి ఎం. శిల్ప, ఎన్. రంగశివజ్యోతి, వై. రజిత, వి.జలజశ్రీ, ఎస్. ఉషశ్రీలు ఎంపికైనట్లు తెలిపారు. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె. మదన్‌మోహన్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో.. వైవీయూ కబడ్డీ మహిళల జట్టుకు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల నుంచి పి. నీలమహేశ్వరి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రవీంద్రనాథ్ తెలిపారు. దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ జట్టు విజయం సాధించేలా చక్కటి ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఫిజికల్ డైరెక్టర్లు టి. హజరతయ్య, సి. దస్తగిరిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్గో వినియోగదారులకు బహుమతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ పరిధిలోని కార్గో సేవలను వినియోగించుకుంటున్న వారికి సంస్థ తమవంతుగా బహుమతులను అందజేసి ప్రోత్సహిస్తోంది. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ సంస్థ కడపకు చెందిన కొత్తాస్ సంస్థ సహకారంతో వినియోగదారులకు లక్కీ డిప్ స్కీమ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం అంటే 3, 10, 17, 24 తేదీలలో ఆ వారం రోజుల్లో బుక్ అయిన డోర్ డెలివరీ బుకింగ్ వినియోగదారుల పేర్లతో లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి ముగ్గురు విజేతలను ప్రకటించడంతోపాటు బహుమతులు అందజేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన లక్కీ డిప్‌లో మొదటి బహుమతి కావ్య, రెండవ బహుమతి శేషుబాబు, మూడవ బహుమతి ఏలియా దక్కించుకున్నారు. వీరికి సంస్థ కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ డిల్లీశ్వరావు, సీఐ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోటీపరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలి

వీరపునాయునిపల్లె : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించే సైన్స్ పోటీపరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి 1 జాఫర్ సాధిక్ తెలిపారు. శుక్రవారం పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన గోడ పత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. పోటీపరీక్షల్లో పాల్గొనడం వలన విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని, ఇలాంటి పరీక్షలు భవిష్యత్‌లో ఉపయోగపడతాయన్నారు. ఎంఈఓ 2 అనిత , జన విజ్ఞాన వేదిక నాయకులు బేరిమోహన్ మాట్లాడుతూ నవంబర్ 10వ తేదీ పాఠశాల స్థాయి, 30వ తేదీ మండలస్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28వ తేదీన విశాఖపట్టనంలో రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు.

నేడు, రేపు పోలింగ్ స్టేషన్‌లలో ఉండాలి

కమలాపురం : మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారం రోజుల్లో ప్రతి బీఎల్వో పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని మండల తహసీల్దార్ సరస్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ సమ్మరి రివిజన్–2024లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎల్వోలందరూ తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటు ఉండి ఫారం 6, 7, 8 తీసుకోవాలని ఆమె తెలిపారు. ఓటు హక్కు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు త్రోబాల్, టెన్నికాయిట్ నందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఓ సావిత్రి దేవి, పీఈటీ శివశంకర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31వ తేదీన నీలకంఠరావుపేట హైస్కూల్‌లో జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలల్లో హైస్కూల్‌కు చెందిన కే.పవిత్ర, జి.ఉపేంద్ర, శివరామిరెడ్డిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 1 న రాయచోటిలోని మాసా పేట హైస్కూల్‌లో జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో గంగనపల్లె హైస్కూల్‌కు చెందిన కే.గంగాదేవి, నందినిలు రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్ఏఎస్ పరీక్ష



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లిల్లెమ్మ

వల్లూరు : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా మండలంలోని విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల అంచనా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని 15 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులకు బదులుగా కడప శ్రీ హరి డిగ్రీ కళాశాలకు చెందిన 27 మంది విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించి వారి ఆధ్వర్యంలో పరీక్షలను నిర్వహించారు. ఓఎంఆర్ షీట్‌లో విద్యార్థులు పరీక్షలను రాశారు. మండలంలోని వేదాస్ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, వల్లూరు జడ్పీ హైస్కూల్, గంగాయపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన పరీక్షలను ఎంఈఓ లిల్లెమ్మ, ఎంఈఓ 2 విజయ్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని 15 పాఠశాలలకు చెందిన 3, 6, 9 తరగతుల విద్యార్థులు మొత్తం 429 మంది పరీక్షలను రాసినట్లు ఎంఈఓ తెలిపారు.

వైద్య సిబ్బంది సర్వే

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బాపణపల్లి గ్రామంలో మాధవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేను నిర్వహిస్తున్నట్లు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బాపణపల్లి గ్రామాన్ని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే–6 కింద ఎంపికైందన్నారు. అందువల్ల నేషనల్ టీమ్ ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గ్రామంలో పర్యటించి వారికి అందుతున్నటువంటి ఎం.సి.హెచ్ సర్వీసు, ఎన్.సి.డి., సి.డి వంటి కుటుంబ నియంత్రణ తాత్కాలిక పద్ధతుల గురించి ఆరా తీస్తారన్నారు. కార్యక్రమంలో ఎం.పి.హెచ్.ఓ. నాగవల్లి, ఎంపీహెచ్ఎస్ జ్యోతి పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో వేగం పెంచాలి

కమలాపురం : ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో వేగం పెంచాలని ఆర్‌డీఓ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతినెల ఎండీయూ వాహన ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి రేషన్ బియ్యం పంపిణీ పై రివ్యూ నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి రోజుకు 100 కార్డుల చొప్పున బియ్యం పంపిణీ చేసేలా చూడాలన్నారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలో బియ్యం పంపిణీ బాగా జరుగుతోందని, అయితే అన్ని గ్రామాల్లో కూడా ఇదే విధంగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ సరస్వతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న మహిళా సమాఖ్య కడప నగర మహాసభ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య కడప నగర మూడవ మహాసభ ఆదివారం మృత్యుంజయ కుంటలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యురాలు వడ్ల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉమాదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అందరికీ విద్య అందరికీ ఉపాధి లక్ష్యంగా భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించామని నగర అధ్యక్ష కార్యదర్శులు యస్.షాకిర్, డి. ఎం. ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండులోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో మాజీ డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య , రామకృష్ణ నగర్ లో డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు పతాకావిష్కరణ చేశారు. అనంతరం డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, మాజీ కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి ,ఉద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ సిద్దిక్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కడప ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్దతో విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తుందని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషన్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్ బాష అన్నారు. శుక్రవారం కడప నగరంలోని సాలే నాగయ్య ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సభ్యులు అలీ, షేర్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు డీఎంపై దాడి తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని ఏపీఎస్ ఆర్టీసీ తణుకు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న గిరిధర్‌పై కత్తితో దాడి చేసి గాయపరచిన డిపో డ్రైవర్ నాగరాజు చర్యలను ఖండిస్తున్నామని ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కేకే కుమార్, ఎన్ రాజశేఖర్‌లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఉద్యోగిగా ఇటువంటి దాడులు సమర్థనీయం కాదని, ఎన్ని సమస్యలున్నా చర్చలతో పరిష్కరించుకోవాలే తప్ప ఇలా భౌతిక దాడులకు దిగడం సరికాదన్నారు. ఇలాంటి దాడులతో సమస్య మరింత జటిలం అవుతుందని సూచించారు.

వ్యాసరచన పోటీలు



కడప ఎడ్యుకేషన్: కడప సాలె నాగయ్యవీధిలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మను పాలిటెక్నిక్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 11వ తేదీన మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆయన జీవిత విధానం, ఆయన చేసిన పోరాటాలు, సేవల గురించి విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన వారికి ఈ నెల 8వ తేదీన మను పాలిటెక్నిక్ కళాశాలలో డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజాద్‌బాషా చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖీత్‌ఖాన్ తెలిపారు.

ఆరుతడి పంటలను సాగు చేయాలి



చామంతి తోట పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె, ఉప్పరపల్లి రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకు ఎం. నాగరాజు తెలిపారు. రెండు ఆర్బీకేల్లో యూరియా ఎరువులు పుష్కలంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అనంతరం గ్రామస్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీలో బోరు బావుల కింద ఆరుతడి పంటలు సాగు చేపట్టాలన్నారు. వరి సాగు ఎట్టి పరిస్థితిల్లోనూ సాగు చేయరాదన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని పెంచాలన్నారు. బొగ్గిడివారిపల్లి చామంతి తోటలను పరిశీలించి కలుపు, సస్యరక్షణ చర్యలతోపాటు పోషక లోప నవరణ చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : డీఈఓ రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై విచారణ జరిపిన అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌కుమార్, రాజేంద్రప్రసాద్‌లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అధికారుల వైఖరి ఇలాగే కొనసాగితే విద్యార్థి సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అమృత కలశయాత్రలో యువత

కడప స్పోర్ట్స్: మేరీ మట్టీ.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి సేకరించిన మట్టిని అమృత కలశయాత్రలో భాగంగా జిల్లాకు చెందిన పలువురు యువత ఢిల్లీకి తీసుకువెళ్లి అమృతఘాట్‌లో కలిపినట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. జిల్లా నుంచి వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల నుంచి పట్టుపోగుల సుబ్బారావు, నారాయణ, అబ్దుల్, యశ్వంత్, వాసు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.